మరో రైతు ఆత్మహత్య

- నీళ్లు లేక ఎండిన పంటలు..
- అప్పులు తీర్చలేక బలవన్మరణం

నాగారపు సుభాష్ (ఫైల్)

చిల్పూరు, ఏప్రిల్ 17 : పంట చేతికి రాక.. అప్పుల భారం మోయలేక జనగామ జిల్లా చిల్పూరు మండలం వెంకటాద్రిపేటలో బుధవారం ఓ రైతు ప్రాణాలు తీసుకున్నాడు. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాద్రిపేటకు చెందిన రైతు నాగారపు సుభాష్ (40) తనకున్న ఎకరం భూమితోపాటు రెండేండ్ల క్రితం మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకున్నాడు. అందులో వరి, మక్కజొన్న పంటలు వేశాడు. సాగునీరు లేక పంట చేతికి రాలేదు. రూ.6 లక్షల వరకు అప్పు అయ్యింది. దీంతో మనస్తాపానికి గురైన సుభాష్ బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే వెళ్లి అతడిని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేసున్నట్టు ఎస్సై తెలిపారు.

16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

ప్రధానికి ఆర్ కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని 72 ప్రభుత్వ శాఖల్లో, 245 ప్రభుత్వ రంగ సంస్థల్లో 16లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని,వెంటనే వాటిని భర్తీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రధాని ప్రకటించాలని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి కృష్ణయ్య బుధవారం ఓ లేఖను రాసి దానిని మీడియాకు విడుదల చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులు మొత్తాన్ని భర్తీ చేస్తే మండల్ కమిషన్ నివేదిక ప్రకారం బీసీలకు 27 శాతం ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సేకరించిన సమాచారం ప్రకారం కేంద్రంలో బీసీ ఉద్యోగులు తొమ్మిది శాతమే ఉన్నట్టు తేలిందన్నారు. 74 ఏండ్ల తర్వాత కూడా బీసీల దుస్థితికి ఇది నిదర్శనమని ఆవేదన వ్యక్తంచేశారు. ఖాళీలను వెంటనే కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలని, లేకుంటే జూన్‌లో పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన చేపడుతామని హెచ్చరించారు.

కలెక్టర్ లోడ్.. రిటర్న్!

మొదటిపేజీ తరువాయి...

మెలిక పెట్టారు. కమలాపూర్‌లో ప్యాడీ క్లీనింగ్ చేసి పంపిన ధాన్యాన్ని కూడా మిల్లర్ తిరస్కరించి పంపించడంపై రైతులు నిరసన వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రంలో పోసిన వడ్లను శుద్ధి చేయాలంటే ఎలా ? అని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. వడ్లు ఎక్కువ ఉన్న రైతులు ఎన్ని రోజులు కొనుగోలు కేంద్రంలో ఉండి శుద్ధి చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. మిల్లర్ల సాకులు, రైతుల ఇబ్బందులతో కాంటాలు నిలిచిపోయాయి. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగానే ఉంటున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది ఉండడంతో రైతులు నేరుగా వ్యాపారులకు, మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రం నుంచి తిరిగి తీసుకెళ్తే రవాణాచార్జీల భారం పడుతున్నది. కొనుగోలు కేంద్రంలో కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రకం వడ్ల ధర కింటాకు రూ.2,203, సాధారణ రకం వడ్లు కింటాకు రూ.2.183గా ఉన్నది. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం కాంటాలు మొదలు పెట్టకపోవడంతో రైతులు రూ. 200 తక్కువకు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తున్నది.


హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

బోనస్ తప్పించుకునేందుకు..

వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ ఆ విషయంలో స్పష్టత ఇవ్వడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను అమ్మిన రైతులకు మాత్రమే బోనస్ ఇచ్చే అవకాశం ఉంటుంది. ప్రైవేటు వ్యాపారులకు విక్రయించిన రైతుల పంటకు బోనస్ రాదు. ఇలా అయితే వ్యాపారులకు ధాన్యం అమ్ముకున్న రైతులు క్వింటాలుకు రూ. 700 నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలనుకుంటే..కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులు స్పష్టత ఇవ్వడంలేదు. కొనుగోలు కేంద్రాల నుంచి వడ్లను మిల్లులకు తరలించే ప్రక్రియను 5 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో కొనుగోలు కేంద్రానికి 40 వాహనాలను కేటాయించారు. రవాణా కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు వాహనాలను సమకూర్చలేదు. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేస్తున్నదని, అందుకే కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు జరగడంలేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ప్యాడీ క్లీనర్

ఎక్కడి కుప్పలు అక్కడే!

ధాన్యం తూకంలో తీవ్ర జాప్యం ● కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు

మెదక్ జిల్లావ్యాప్తంగా ఎక్కడి వడ్లు అక్కడే ఉన్నాయి. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నెమ్మెదిగా సాగుతున్నాయి. జిల్లాలో యాసంగిలో 410 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో 4.20 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు కేవలం 600 రైతుల నుంచి 3059.24 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. సేకరించిన ధాన్యం విలువ రూ.6.74 కోట్లు మాత్రమే. ఇందులో కేవలం రూ.24 లక్షలు మాత్రమే రైతులకు డబ్బులు చెల్లించారు. ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలో టెంట్లు, తాగునీటి వసతి, కూలీల కోసం షెడ్డు ఏర్పాటు చేయలేదు. 1.05 కోట్ల గన్నీ బస్తాలు అవసరం ఉండగా, 47.46 లక్షల బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. - మెదక్

క్లీనింగ్‌కు రైతులు ఇష్టపడటం లేదు

గతంలో లాగా కాకుండా కొనుగోలు కేంద్రాల నుంచి తరలించే వడ్లను కచ్చితంగా క్లీనింగ్ చేసి పంపించాలని మిల్లర్లు నిబంధన విధించారు. వడ్లను క్లీనింగ్ చేయించి మిల్లుకు పంపించాలని అధికారులు మాకు ఆదేశాలు ఇచ్చారు. రైతులు ప్యాడీ క్లీనింగ్‌కు నిరాకరిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న ఈ సమయంలో ప్యాడీ క్లీనింగ్ ఎలా చేస్తామని రైతులు అంటున్నారు.

- పాములపర్తి రత్నకుమారి, సెంటర్ నిర్వాహకురాలు

పది రోజులయితాంది

రెండు వారాల కింద వరి కోపించిన. నాలుగు రోజులు కల్లంలోనే వడ్లు ఎండినయి. కొన్ని వడ్లను శాంపిల్‌గా తెచ్చి తేమ శాతాన్ని చూపించాను. సరిపోతుందని చెప్పడంతో పది రోజుల కింద వడ్లను తెచ్చి కొనుగోలు కేంద్రంలో పోశిన. ఇక్కడ పందులు, కోతులు ఉన్నయి. ఎండలో కావలి ఉండుడు కష్టమైతాంది. ఇక్కడి నుంచి ఒక్క బస్తా కూడా మిల్లుకు పోలేదు.

- నాగెల్లి మణెమ్మ, రైతు, ఎల్కతుర్తి, హనుమకొండ జిల్లా

ఆదేశాల మేరకు పనిచేస్తున్నాం

కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వడ్లను క్లీనింగ్ చేసిన తర్వాతే రైస్ మిల్లుకు తరలించాలని ప్రత్యేకమైన ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే మిల్లుకు పంపించాలని ఉన్నతాధికారులు మమ్మల్ని ఆదేశించారు. ఆ తరహాలోనే వడ్లను మిల్లులకు తరలిస్తాం.

- కల్యాణి, ఏకశిలా, ఎల్కతుర్తి, హనుమకొండ జిల్లా

పట్టుడు మాతోటి అయితదా

మూడెకరాల్లో పండిన వడ్లను కొనుగోలు కేంద్రానికి తెచ్చి వారం అయితాంది. మాపటికి కూలోళ్లను పెట్టి దగ్గర చేస్తున్న. రోజూ ఇదే పని అయితాంది. ఇప్పుడు కొత్తగా వడ్లను తూర్పార పట్టి పంపిస్తేనే తీసుకుంటమని సార్లు చెప్తుండ్రు. ఈ వడ్లను పట్టేది లేదు. అవసరం అనుకుంటే అడ్డికి పావుసేరు అమ్ముకుంట. ఎండకాలంల అంత పని మాతోని గాదు.

- నరిగె రాధిక, రైతు, ఎల్కతుర్తి, హనుమకొండ జిల్లా

గొంగిడి మహేందర్‌రెడ్డికి కేసీఆర్ అభినందన

ఉత్తమ సహకార సంఘం అధ్యక్షుడిగా జాతీయ స్థాయిలో అవార్డు పొందిన ఉమ్మడి నల్లగొండ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో కేసీఆర్‌ను డీసీసీబీ చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. సహకార సంఘంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికి అందించిన సేవలకుగాను జాతీయ స్థాయిలో ఉత్తమ సహకార బ్యాంకు అధ్యక్ష అవార్డు పొందినట్టు ఆయన కేసీఆర్‌కు వివరించారు. నల్లగొండ సహకార బ్యాంకును లాభాల్లోకి తీసుకొచ్చినందుకు గొంగిడి మహేందర్‌రెడ్డిని కేసీఆర్ అభినందించి ఆశీర్వదించారు. - యాదగిరిగుట్ట

కేరళ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి

- రాహుల్, కేసీ సెగ్మెంట్లలో ఎన్నికల ప్రచారం
- రాష్ట్రంలో 50 సభలు.. 15 రోడ్‌షోలకు హాజరు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేందుకు బుధవారం కేరళ రాష్ట్రానికి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార జాతీయ స్టార్ క్యాంపెయినర్లలో ఒకరైన రేవంత్‌రెడ్డికి ఏడు రాష్ట్రాల పీసీసీల నుంచి ఆహ్వానాలు అందాయి. దీనిలో భాగంగా కేరళలో రెండు రోజులపాటు ఉండనున్న రేవంత్‌రెడ్డి ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తరపున వయనాడ్‌లో బుధవారం జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తరపున అలప్పుజి (అలెప్పి) నియోజకవర్గంలో జరిగే ఎన్నికల ప్రచారసభలోనూ పాల్గొననున్నారు. ఈ నెల 19 నుంచి వచ్చే నెల 11 వరకు రాష్ట్రంలో జరిగే ఎన్నికల ప్రచారసభల్లో రేవంత్‌రెడ్డి పాల్గొంటారు.పీసీసీ ఆయన ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా 50 బహిరంగసభలు, 15 రోడ్ షోలలో ఆయన పాల్గొనున్నారు.

కాంగ్రెస్‌ను టచ్ చేస్తే..

బీఆర్ఎస్ పునాదులు లేకుండా చేస్తా

- మూడు నెలల్లో బీఆర్ఎస్‌లో మిగిలేది ముగ్గురే
- రేవంత్ లిల్లీపుట్ కాదు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నీలగిరి, ఏప్రిల్ 17 : ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని కేసీఆర్ చెబుతున్నారని, కాంగ్రెస్‌ను టచ్ చేసి చూడాలని, హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌ను పునాదులతో కూల్చేసి బీఆర్ఎస్ లేకుండా చేస్తానని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి బీజేపీలోకి పోతున్నారని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రెండేండ్లయినా కవితకు బెయిల్ రాదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డిని లిల్లీపుట్ కాదని, ఆయన ప్రజల నుంచి వచ్చిన నాయకుడని అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణలో కనుమరుగయ్యే పరిస్థితి ఉన్నదని, తాము అనుకుంటే బీఆర్ఎస్ లో ముగ్గురు మాత్రమే మిగులుతారని చెప్పారు.


మల్దకల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుల ఘర్షణ

- సీనియర్ నేత బండ్ల చంద్రశేఖర్ రెడ్డికి తీవ్రగాయాలు
- గద్వాల జిల్లాలో భగ్గుమన్న పార్టీ గ్రూపు విభేదాలు

మల్దకల్, ఏప్రిల్ 17 : జోగుళాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. మల్దకల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు సరిత, సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించగా ఎంపీ అభ్యర్థి మల్లు రవి హాజరయ్యారు. ప్రచార రథంపైకి ముఖ్య నేతలతోపాటు సీనియర్ నేత బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన తమ్ముడు బండ్ల రాజశేఖర్ రెడ్డి ఎక్కడానికి ప్రయత్నించారు. అయితే మండలంలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన పార్టీ నేత రామకృష్ణ.. తమ మండలంలో జరిగే ఎన్నికల ప్రచారంలో ఇతర మండలాలకు చెందిన నాయకులు ఎక్కువద్దంటూ చంద్రశేఖర్‌రెడ్డిని, అతడి తమ్ముడిని అడ్డుకున్నాడు. దీంతో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరగడంతో రామకృష్ణ వర్గీయులు చంద్రశేఖర్‌రెడ్డిపై దాడి చేశారు. కొద్దిరోజుల కిందట ఆపరేషన్ చేయించుకున్న చోటే పిడిగుద్దులు గుద్దినట్టు సదరు నేత వాపోయాడు. చంద్రశేఖర్‌రెడ్డిని మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నొప్పులు ఎక్కువగా ఉండటంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు దవాఖానకు తరలించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ముందుగా తన షర్ట్‌ను చంద్రశేఖర్ చింపారని, అందుకే గొడవ మొదలైందని రామకృష్ణ తెలిపాడు. తనకు కూడా దెబ్బలు తగిలినట్టు ఆయన పేర్కొన్నారు.


గట్టులో నిర్వహించిన ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత

నా పార్టీ వాళ్లే.. నన్ను ఓడగొట్టారు

కాంగ్రెస్ జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆవేదన

గట్టు, ఏప్రిల్ 17: తన పార్టీ నాయకులే తనను ఓడించారని కాంగ్రెస్ నేత, జోగుళాంబ గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గట్టు మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఎదుటే ఆమె మాట్లాడుతూ.. 'అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనాదరణ, ఇలాంటి కార్యకర్తలు అభిమానం చూసే 50 వేల మెజార్టీతో గెలుపు ఖాయమని అనుకున్న. కానీ నా అనుకున్న వాళ్లే నన్ను వెన్నుపోటు పొడిచారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభమేమి? ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. సీఎం రేవంత్‌రెడ్డి అందరినీ కాదని నాకు టికెట్ ఇచ్చారు. అయినా లాభం లేకపోయింది' అని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ సమావేశం జరిగినా వేదిక ముందుకు వెళ్లడానికి మనసు ఒప్పడం లేదని అన్నారు. అప్పటిలా వెన్నుపోట్లు పొడవకుండా ఈ సారైనా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌కు 'రైతు' కలవరం

- నీళ్లివ్వక పంటలు ఎండె.. పండిన పంటలూ కొనకపాయె
- రైతు భరోసా ఇవ్వకపాయె.. పంట బోనస్సూ లేకపాయె
- ఏ హామీ అమలుకాక రైతుల్లో పెరుగుతున్న అసహనం
- ఆ వర్గమంతా దూరమవుతున్నదని హస్తం పార్టీ ఆందోళన
- ఇట్లే కొనసాగితే ఎన్నికల్లో భంగపాటు తప్పదన్న భయం
- రైతుల మచ్చికకు ఆపసోపాలు
- ఎన్నికలయ్యాక హామీలన్నీ అమలుచేస్తామని వాగ్దానాలు
- ఇప్పడెందుకు చేయలేదని నిలదీస్తున్న రైతులు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో రైతులంతా వ్యతిరేకమవుతున్నారని కాంగ్రెస్‌కు టెన్షన్ పట్టుకున్నదా? అందుకే దిద్దుబాటు చర్యలు చేపట్టిందా? రైతులు 'చేయి' జారిపోకుండా మళ్లీ ఎన్నికల హామీల వల వేస్తున్నదా? అంటే.. ప్రభుత్వం, ఆ పార్టీ పెద్దలు అనుసరిస్తున్న తీరు నిజమేమోనన్న సందేహాలు కలుగుతున్నాయి. వారం రోజులుగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, పార్టీ పెద్దలంతా రైతుల జపం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రస్తుతం అమలు చేయలేకపోయామని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత అన్ని హామీలను కచ్చితంగా అమలు చేస్తామంటూ మళ్లీ హామీలు గుప్పిస్తున్నారు. ఏయే పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో కూడా చెప్తున్నారు. చిన్న మీటింగ్ అయినా, పెద్ద బహిరంగ సభ అయినా.. రైతుల అంశాలనే ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగానే రైతుల టెన్షన్ పట్టుకున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్క రైతు హామీ నెరవేర్చలే

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు హామీలతో వల వేసింది.

ఇందులో ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదు. వరి క్వింటాకు రూ.500 బోనస్, డిసెంబర్ 9లోపు రూ.2 లక్షల రుణమాఫీ, రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు రైతుభరోసా, అన్ని పంటలు మద్దతు ధరకు కొనుగోలు, ప్రతి పంటకు మద్దతు ధరకు మించి బోనస్, పంటలబీమా, రైతు కమిషన్ ఏర్పాటు, ప్రతి ఎకరాకు సాగునీరు.. ఇలా రైతులకు అనేక హామీలు ఇచ్చింది. ఇందులో ఏ ఒక్కటీ అమలుచేయలేదు. ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామని పదే పదే చెప్పారు. కానీ, గడువు పూర్తయినా ఆ ముచ్చటే తీయలేదు.

హామీల అమలుకు కోడ్ అడ్డొచ్చిందట

'రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే అనుకున్నాం కానీ అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు రుణమాఫీ, ధాన్యం బోనస్ హామీలను ఎలా అమలు చేస్తాం..?' పలు సందర్భాల్లో కాంగ్రెస్ మంత్రులు చెప్పిన మాటలివి. కానీ, 100 రోజుల గడువు పూర్తయ్యాకే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. గడువులోపు అమలు చేయకుండా, 'కోడ్'ని సాకుగా చూపటం ఏమిటని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు కాంగ్రెస్ సర్కారు వచ్చాకే తమకు కష్టాలు మొదలయ్యాయని మండిపడుతున్నారు. ఓవైపు సాగునీటి కష్టాలు, మరోవైపు ఎండుతున్న పంటలతో రైతుల్లో వ్యతిరేకత పెరుగుతున్నది. ముఖ్యంగా సాగునీటి కష్టాలు, పంటలు ఎండిపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ పాలన, నిర్వహణ లోపం వల్లే సాగునీటి కొరత ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలో ఐదారేండ్లుగా కనిపించని దుస్థితి పునరావృతం కావటాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. కేసీఆర్ పాలన, కాంగ్రెస్ పాలనను పోల్చుతూ.. ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ఈ వ్యతిరేకత రోజురోజుకు మరింత పెరుగుతున్నది.

కలవరంలో ప్రభుత్వం

ఓ వైపు ఎన్నికలు దగ్గరపడుతున్నాయి మరోవైపు ప్రభుత్వంపై రైతుల్లో వ్యతిరేకత పెరుగుతున్నది. దీంతో కాంగ్రెస్ పెద్దల్లో కలవరం మొదలైనట్టు తెలిసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి గట్టి దెబ్బ పడటం ఖాయమనే ఆందోళన పార్టీ నేతల్లో వ్యక్తం అవుతున్నది. వ్యతిరేకతను తగ్గించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని రేవంత్ ప్రకటించటం, వచ్చే సీజన్ నుంచి బోనస్, రైతుభరోసా వర్తింపజేస్తామని సమీక్షల్లో తుమ్మల వ్యాఖ్యానించటం గమనార్హం. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లోనే కాంగ్రెస్ హామీలకు మోసపోయామని, మళ్లీ కొత్త హామీలను ఎలా నమ్ముతామని ఆ పార్టీపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పదకొండు బోర్లు వేసినా పంట రాకపాయె

- ఉన్నదే ఎకరం పొలం.. మరో ఎకరం కౌలు
- దుబాయ్‌కి పోయి వచ్చినా తీరని అప్పులు
- మనస్తాపంతో ఉరేసుకుని రైతు ఆత్మహత్య
- పుట్టెడు దుఃఖంలో కుర్మస్వామి కుటుంబం
- ఉండడానికి ఇల్లు లేదు.. పూరిగుడిసెలోనే జీవనం
- ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి



తమ పూరి గుడిసె వద్ద కుర్మ స్వామి ఫొటోతో ఆయన భార్యపిల్లలు, పక్కన నీళ్లు పడని బోరు వద్ద కుర్మ స్వామి తండ్రి ఎల్లయ్య

మెదక్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : ఉండడానికి ఇల్లులేదు. పూరి గుడిసెలోనే జీవనం. జీవనోపాధి కోసం దుబాయ్‌కి పోయాడు. అనారోగ్యంతో తిరిగి వచ్చాడు. కుటుంబంతో కలిసి ఉన్న ఊర్లోనే ఉపాధి పొందాలని అనుకున్నాడు. అప్పుడు కనిపించిన ఒకే ఒక ఆశాకిరణం ఉన్న ఎకరం భూమి. అందులో వ్యవసాయం చేయాలంటే సాగునీళ్లు కావాలి. అందుకోసం ముందు ఒక బోరు వేశాడు. అందులో నీళ్లురాలేదు. మరో బోరు వేశాడు.. అందులోనూ నీళ్లు రాలేదు. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా పదకొండు బోర్లు వేశాడు. దుబాయ్ సంపాదనతో పాటు బయటి నుంచి అప్పుగా తెచ్చిన డబ్బులన్నీ బోర్లలోనే పోశాడు. కొద్ది కొద్దిగా పోస్తున్న నీటి కంటే కుప్పలుగా పేరుకుపోయిన అప్పులే ఎక్కువగా కనిపించాయి. ఉన్న ఎకరానికి తోడు మరో ఎకరం కౌలుకు తీసుకుని సాగుచేసినా.. దిగుబడి కలిసి రాలేదు. దిక్కుతోచని స్థితిలో పొలం వద్దనే చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మెదక్ జిల్లా చేగుంట మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన కుర్మ స్వామి(30) జీవనోపాధి కోసం దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ అనుకోని ప్రమాదం ఆయన్ను ఇంటికి రప్పించింది. భార్య, ఇద్దరు కొడుకులతో కలిసి ఊర్లోనే ఉండాలనుకున్నాడు. ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో, పూరి గుడిసె వేసుకున్నారు. స్వామికి ఎకరం లావుణి పట్టా భూమి ఉంది. దాని పక్కన ఉన్న మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఈ భూమిలో పంటలకు సాగునీళ్ల కోసం.. ఉన్న ఎకరంలోనే బోరు వేయించాడు. నీళ్లు రాలేదు. మళ్లీ ప్రయత్నించాడు. అదే పరిస్థితి. ఇలా మొత్తం ఎకరం పొలంలో పదకొండు బోర్లు వేశాడు. బోర్లకు సుమారు రూ.12 లక్షల వరకు అప్పులు అయ్యాయి. ఆగి ఆగి సన్నగా పోస్తున్న బోరు నీటి పంటలకు నీళ్లం దలేదు. దీంతో పంటలు ఎండిపోయాయి. కౌలు పైసలతో పాటు పెట్టుబడి కూడా మీద పడింది. ప్రతి రోజూ ఎండిపోతున్న పొలాన్ని చూస్తూ కుమిలిపోయేవాడు. పేరుకుపోయిన అప్పులను తలచుకొని కుర్మస్వామి పూర్తిగా కుంగిపోయాడు. రోజూ మాదిరిగానే మార్చి 11న సాయంత్రం పొలానికి వెళ్లాడు. కానీ తిరిగి రాలేదు. ఉదయం వరకూ స్వామి ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు వెళ్లి చూడగా వేప చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న స్వామి కానరానిలోకాలకు వెళ్లడంతో భార్యాపిల్లలు భోరుమన్నారు. కుటుంబానికి ఉన్న ఒక్క ఆధారం దూరమవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.

కుటుంబంవైపు కన్నెత్తిచూడని సర్కార్

బోర్లు వేసి అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న కుర్మ స్వామి కుటుంబంవైపు రాష్ట్ర ప్రభుత్వం కన్నెత్తి చూడడం లేదు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుర్మ స్వామి కుటుంబాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ కనీసం పరామర్శించలేదు. వయసుపైబడిన తల్లిదండ్రులు, భార్యా,పిల్లలు స్వామి మరణంతో దిక్కులేని వారయ్యారు.

గుడిసెలోనే జీవనం

కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామికి కనీసం ఉండడగానికి ఇళ్లు కూడా లేదు. ప్లాస్టిక్ కవర్లతో ఉన్న గుడిసెలోనే స్వామి తల్లిదండ్రులు, భార్య, పిల్లలు నివసిస్తున్నారు. కుర్మస్వామి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉజ్వల చారిత్రక వారసత్వ సంపద తెలంగాణ సొంతం

దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ) : ఉజ్వల చారిత్రక వారసత